క్లుప్తంగా

ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం



సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావు మద్దతు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ కోరారు. గ్రామంలో లక్ష్మణరావుకు మద్దతుగా శనివారం ప్రచారం నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ సివిల్స్, గ్రూప్స్‌లో ఇప్పటి వరకు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్, ఆర్డీఓ, డీఎస్పీ ఇలాంటి అనేకమందిని పదుల సంఖ్యలో అధికారులను సమాజానికి అందించి నిస్వార్థ ప్రజాసేవకుడుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రావూరి పూర్ణచంద్రరావు, షేక్ హుస్సేన్‌సా, కె.వెంకటేశ్వర్లు, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మురుగుకాలువలను శుభ్రం చేయాలని వినతి



నకరికల్లు: స్థానిక సినిమాహాలు వీధిలో కొత్తగా నిర్మించిన మురుగుకాల్వల నుంచి మురుగునీటి పారుదల లేక అవస్థలు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ మా ప్రాంతంలో మురుగుకాల్వలు నిర్మించి వదిలేశారన్నారు. దీంతో మురుగునీటి పారుదల లేక కాలువలు నిండి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. దోమలు కూడా విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని వాపోయారు. పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి మురుగు కాల్వల్లోని మట్టిని, వ్యర్థాలను తొలగించే నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సేవాలాల్ మహారాజ్ చిరస్మరణీయుడు



అచ్చంపేట: లంబాడాలను నాగరికత వైపు మళ్లించిన మహోన్నత వ్యక్తి సేవాలాల్‌మహారాజ్ అని మాజీ ఎంపీపీ రామకోటేశ్వరరావునాయక్ అన్నారు. సుగాలీల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి స్థానిక మండల పరిషత్ మీటింగ్‌హాలులో శనివారం నిర్వహించారు. తొలుత పలువురు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసిన ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోయా శ్రీనివాసరావు, అచ్చంపేట పంచాయతీ కార్యదర్శి పంతులునాయక్, పంచాయతీరాజ్ ఏఈ ధర ణికోట శివయ్య, రామావతు బాలనాయక్, బాణావతు రామకోటినాయక్, బద్దూనాయక్, చిన్నిభాయ్, మూడవతు కృష్ణానాయక్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంపీ పరామర్శ

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని చాగంటివారిపాలెంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శనివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన నలుగురు వ్యవసాయ కూలీలు మిరప కోతలకు వెళ్లి ఇంటికి వస్తూ బొల్లవరం వద్ద ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. గ్రామంలోని వారి గృహాలకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతుల్లోని మధిర గంగమ్మకు చెందిన మనువడు, చక్కెర మాధవికి చెందిన ఇద్దరు కుమారులను కేంద్రీయ విద్యాలయంలో చేర్పించాలని సూచించారు. ఆ మేర సిఫార్సు చేస్తానని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయానికి పంపించాలని సూచించారు. అనంతరం ముప్పాళ్లలోని ముస్లిం కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ రహంతుల్లా కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు ఉన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ అరెస్ట్

ముప్పాళ్ల: మండలంలోని చాగంటివారిపాలెంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన నలుగురు వ్యవసాయ కూలీలు మిరప కోతకు వెళ్లి ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సీహెచ్ శివపై నమోదైన కేసులో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

రైతు కంట్లో కారం

- మిర్చి ధర పతనం
- ఆందోళనలో అన్నదాతలు
- మద్దతు ధర కల్పించని కూటమి ప్రభుత్వం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు భూమిరెడ్డి సుబ్బారెడ్డి. ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెం. రెండు ఎకరాల్లోనే మిరప పంట సాగు చేశాడు. మొదటి కోతలో పది క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. కోత దశలోనే పంటకు నల్లి ఆశించటంతో ముడత ఆశించింది. ట్రిప్పుకు రూ.5 వేలు విలువ చేసే పురుగుమందులు రోజు మార్చి రోజు పిచికారి చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటి వరకు రూ.లక్ష 80 వేలు వరకు పెట్టుబడి పెట్టాడు. గత ఏడాది మొదటి కోత సమయంలోనే కల్లంలో ఉన్న మిరపకాయలను క్వింటా రూ.22 వేలు ఇచ్చి కొనుక్కొని పోయారని, ఈ ఏడాది రూ.12 వేలుకు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రూ.50 వేలు నష్టం వచ్చేలా ఉంది..



ఎకరం రూ.15 వేలు ముందు కౌలుతో ఎకరన్నరలో తేజ రకం సాగు చేశా. ఇప్పటి వరకు లక్షన్నర పెట్టుబడి అయింది. పంటకు వైరస్ తెగులు ఆశించి పూర్తిగా దెబ్బతింది. సగటున ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా ఉంది. మార్కెట్‌లో ధర లేక పోవటంతో ఎకరాకు రూ.50 వేలు నష్టంవచ్చేలా ఉంది.

–గంజి శ్రీనివాసరావు, రైతు, దమ్మాలపాడు

ముప్పాళ్ల: మండలంలో మొత్తం 1,628 ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. గత ఏడాది 2,406 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే తక్కువ విస్తీర్ణంలో సాగు చేసినా మద్దతు ధరలేకపోవటంతో రైతులు నష్టపోయే పరిస్థితి దాపురించింది.



చాగంటివారిపాలెం లో బొబ్బర తెగులు సోకిన మిర్చి పంట

పెట్టుబడి బారెడు...

మిరప పంట సాగు చేసేందుకు ఎకరాకు ముందు కౌలు రూ.15 వేలు చొప్పున ముందు కౌలు చెల్లించాలి. మార్కెట్‌లో క్వింటా మిర్చి రూ.10 వేలు నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది. పెట్టుబడి మాత్రం విపరీతంగా పెరిగింది. చీడపీడల నివారణకు క్రిమిసంహారక మందులు, కూలీలకు ఎకరాకు రూ.1.20 లక్షల వరకు ఖర్చు చేశారు. క్వింటాలుకు కనీసం రూ.20 వేలు పలికితే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. దీనికి తోడుగా పంటపై బొబ్బర తెగులు, నల్లి లాంటి తెగుళ్ల దాడి చేయటంతో పంటను పీకివేసే పరిస్థితి..

గత వైఎస్సార్ సీపీ హయాంలో...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మిర్చి సాగు రైతులకు కలిసొచ్చింది. గరిష్టంగా క్వింటాలుకు రూ.22 వేలు ధర పలికింది. 2022–23లో సగటున 25 క్వింటాళ్ల దిగుబడి రాగా బ్యాడిగ రకం క్వింటాలుకు రికార్డు స్థాయిలో రూ.30 వేలు కూడా పలికింది. గత ఏడాది ఎకరాకు 15 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. అయినా గరిష్టంగా రూ.20 వేలు వరకు ధర పలికింది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమరావతి: మోతడక వద్ద 33 కేవీ నూతన లైన్ నిర్మాణం చేస్తున్న దృష్ట్యా మండల పరిధిలోని అన్ని గ్రామాలకు ఆదివారం సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ పి.రవికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధర్మారావుకు ఉత్తమ టీచర్ అవార్డు



క్రోసూరు: మండలంలోని అందుకూరు ఎంపీయూపీ పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు డి.ధర్మారావుకు బెస్ట్ ఏక్టివ్ పార్టిసిపెంట్ టీచర్ అవార్డు లభించినట్లు శనివారం ఎంఈఓ ఎకుల ప్రసాదరావు తెలిపారు. బెంగళూరు రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ (ఆర్ఐఈ)లో 30 రోజులలో శిక్షణకు హాజరైన ధర్మారావుకు బెస్ట్ పార్టీసిపెంట్ టీచర్ అవార్డును ఆర్ఐఈ డైరెక్టర్ కే ఎస్ మణి అందజేసినట్లు తెలిపారు. దేశంలోని ఐదు రాష్ట్రాల నుంచి 176 మంది శిక్షణలో పాల్గొనగా పది మందిని అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. అవార్డు లభించటంపై ఎంఈఓ– 2 ఎం.గణేష్ అభినందనలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



పట్టణంలోని రంగాకాలనీలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



పట్టణంలోని ట్రెజరీ కార్యాలయ ఆవరణంలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

సత్తెనపల్లి: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛంద్ర కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలో మూడో శనివారం సోర్స్ రిసోర్స్ అనే థీమ్‌తో పట్టణంలోని 31 వార్డుల్లో శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తను తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తగా వేర్వేరుగా నిలువ చేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. తద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండి ఎలాంటి రుగ్మతలు దరిచేరవన్నారు. 2వ వార్డు రంగా కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. మహిళలందరితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణం, మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం సోర్స్ రిసోర్స్ అనే థీమ్‌తో కార్యాలయాలను శుభ్రపరిచారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

రాజుపాలెం: గ్రామాలలో పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది మండల పరిషత్ కార్యాలయం నుంచి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర అంటూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గ్రామ పురవీధులలో నినాదాలు చేసుకుంటూ నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో విద్యార్థినులతో స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ 1,2లు మల్లికార్జునశర్మ, నరసింహారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్, ఈఓపీఆర్డీ పగడాల ముక్కంటి, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

క్రోసూరు మండలంలో..

క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరులో పంచాయతీ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకయ్య, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. పీహెచ్‌సీలో డాక్టర్ ధనుష్ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణకుమార్



క్రోసూరు జెడ్పీపాఠశాలలో జరిగిన ఐసీడీఎస్ శిక్షణ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు

రాజుపాలెం: పిల్లల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో పోషణ్ బీ- పడాయి భీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. శిక్షణలో డాక్టర్ మాట్లాడుతూ పిల్లలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రోజు అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లల పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోషకాహారంపై శ్రద్ధ తీసుకుంటే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ -1 మల్లికార్జున శర్మ, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు,అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆర్‌కే రమాదేవి, బి.ప్రసన్నరాణి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అంగన్‌వాడీలు అవగాహన కల్పించాలి

క్రోసూరు: పోషణ భీ- పడాయి భీ కింద అంగన్‌వాడీలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. క్రోసూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో అచ్చంపేట సెక్టార్ అంగన్‌వాడీ వర్కర్లు, క్రోసూరు జెడ్పీ పాఠశాలలో క్రోసూరు సెక్టార్ అంగన్‌వాడీ వర్కర్లకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణనిచ్చారు. ఏపీ మోడల్ స్కూల్‌లో అచ్చంపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలత్రిపురసుందరీ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించగా, క్రోసూరు జెడ్పీ పాఠశాలలో రిసోర్సు పర్సన్లుగా క్రోసూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.మాధవి, షేక్ మైమున్నీసా వ్యవహరించారు.



మాదలలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలత

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ముగింపు

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ- పడాయి భీ ముగింపు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత పాల్గొని నవచేతన కార్యక్రమంలో భాగంగా 0–3 సంవత్సరాల పిల్లల గృహసందర్శన సమయంలో తల్లులు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల పరిధిలో దివ్యాంగులను గుర్తించి స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా నిత్యం వారిని గమనించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సంతోషకుమారి, సూపర్‌వైజర్ జయలక్ష్మి, స్వర్ణలత పాల్గొన్నారు.

రేపు మిట్టగుడిపాడు తిరునాళ్ల

మిట్టగుడిపాడు(రెంటచింతల): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో వేంచేసిన అతి పురాతనమైన శ్రీ భ్రమరాంబ సమేత నాగేశ్వర స్వామి దేవస్థాన తిరునాళ్ల వేడుకలు ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ప్రధాన అర్చకుడు వెల్లటూరి నాగేశ్వరశర్మ, సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, 7 గం. గణపతిపూజ, 8 గం. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



11 గం. శివపార్వతుల వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాత్రి విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు



సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలోని భక్తాంజనేయ స్వామి దేవస్థానం వార్షికోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ఆలయాన్ని శోభాయమానంగా ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, తోరణాలంకరణతో ప్రారంభించి, 12 గంటల వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు భక్తాంజనేయ స్వామికి బోనాలు సమర్పణ, నగరోత్సవం నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, పంచగవ్యాది ప్రాసనతో ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ గోష్టి నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, 6 గంటల నుంచి 10 గంటల వరకు అష్టోత్తర శత నామ పూజలు నిర్వహిస్తారు. రాత్రి 7.30 గంటలకు కోటి వొత్తులతో దీపోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు శనివారం కోరారు.

19,20 తేదీలలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 19, 20 తేదీలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధి సూరే సుబ్బారావు శనివార తెలిపారు. ఈ సందర్భంగా అఖండనామ ఏకాహ సంకీర్తన పారాయణ, క్షీర కలశాభిషేక మహోత్సవం, జెండా ప్రతిష్టాపన, జ్యోతిప్రజ్వలన, అర్చక కుంకుమ పూజ, లలితాసహస్రనామస్తోత్రపారాయణ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు సకాలంలో హాజరై అమ్మవారి వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయాల్సిందిగా సుబ్బారావు కోరారు.

ఆటోవాలాలు నిబంధనలు పాటించాలి

సత్తెనపల్లి రూరల్ సీఐ సుబ్బారావు



కౌన్సెలింగ్ ఇస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ

నకరికల్లు: ఆటోల్లో అధికంగా ఎక్కి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు సూచించారు. స్థానిక అద్దంకి- నార్కట్ పల్లి రాష్ట్ర రహదారిపై శనివారం తనిఖీలు నిర్వహించారు. కూలీలతో కిక్కిరిసిపోతున్న ఆటోలను నిలిపివేశారు. ఆటో డ్రైవర్, కూలీలతో మాట్లాడారు. గతంలో అధికలోడుతో వెళ్తున్న ఆటోలు ప్రమాదాలకు గురై కూలీలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు గుర్తు చేశారు. ఉపాధి కోసం వెళ్తున్నా ప్రాణాలు నిలబెట్టుకోవడం ముఖ్యమని చెప్పారు. ఓవర్‌లోడుతో వెళ్తే వాహనాలు కంట్రోల్ కాక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. నిబంధనలు పాటించని ఆటో యజమాలు, డ్రైవర్‌లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తామని ఎక్కువమంది కూలీలను ఎక్కించుకుంటే ఆటో యజమానులు, డ్రైవర్‌లపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా సురేష్, ఏఎస్ఐ బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలి



మాట్లాడుతున్న ఏడీఏ హనుమంతరావు

పీసపాడు(క్రోసూరు): వ్యవసాయ శాఖ ద్వారా ఈ సంవత్సరం నుంచి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలను పారదర్శకంగా, సులభతరంగా చేయడం కోసం వెబ్ ల్యాండ్‌లో పొలం కలిగి ఉన్న ప్రతి ఒక్క రైతుకు 'ప్రత్యేక గుర్తింపు సంఖ్య' ను ఇస్తున్నట్లు ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. మండలంలోని పీసపాడు రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక సంఖ్య కలిగిన రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందేందుకు రైతు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీ, అడంగల్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, ఆధార్ నంబర్‌కు లింకు అయిన ఫోను నంబర్‌తో రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందుటకు ప్రభుత్వం ఈనెల చివరి దాకా గడువుగా నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఏఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆలయ మండపాల జీర్ణోద్ధరణకు భూమిపూజ



దేవస్థాన మండపాల పునర్నిర్మాణాలకు భూమి పూజచేస్తున్న శ్రీనివాసమూర్తి

అచ్చంపేట: మండలంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న చామర్రులో జీర్ణోద్ధరణకు గురైన శ్రీ లక్ష్మీశ్వరస్వామి దేవస్థానంలో నవనాగసహిత మానసాదేవి నాగమంటపం, శ్రీ లక్ష్మీశ్వరబాలాలయ అభిషేక మండపాల నిర్మాణానికి చామర్రు రూరల్ డవలప్‌మెంట్ చైర్మన్ ఉప్పల శ్రీనివాసమూర్తి శనివారం భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా గోపూజ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన, పంచగవ్యప్రాసన, రక్షాంబంధన, వాస్తు మంటపారాధన ప్రధాన కలశ స్థాపన, వాస్తు హోమం చేశారు. పలు గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కార్యక్రమాలను తిలకించారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ చామర్రులో పవిత్ర కృష్ణానది ఒడ్డున జీర్ణోద్ధరణకు గురైన మండపాలను తిరిగి తిర్మించుకోవడం పూర్వజన్మ సుకృతం అన్నారు.

దొంగతనం చేసి.. స్థానికులకు దొరికేసి..!

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు
- పలు కేసుల్లో చోరశిఖామణిగా గుర్తింపు



కోటేశ్వరరావును పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

దాచేపల్లి: ఇళ్లలోకి చోరీచేసి వెళ్తున్న దొంగని స్థానికులు పట్టుకున్నారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంలో రెండు ఇళ్లల్లో దొంగతనం చేసి పారిపోతున్న మిర్యాలగూడెంకి చెందిన వేముల కోటేశ్వరరావు అలియాస్ కోటేశ్ అనే దొంగని శనివారం స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామస్తు కథనం ప్రకారం.. నారాయణపురంలో నివాసం ఉంటున్న గాజుల గాంధీ అనే వ్యక్తి ఇంటిలోకి దొంగ కోటేశ్వరరావు చొరబడి నగదు చోరీ చేశాడు. అక్కడి నుంచి కొత్త రామారావు అనే వ్యక్తి ఇంటిలోకి ప్రవేశించి నగదు, నగలు చోరీ చేసి బయటకు వస్తున్న క్రమంలో స్థానికులు దొంగని గుర్తించారు. స్థానికులు అక్కడకు చేరుకోవటంతో దొంగ కోటేశ్వరరావు పారిపోయేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశాడు. స్థానికులు చాకచక్యంగా దొంగని వెంబడించి పట్టుకున్నారు. పారిపోతుండగా పట్టుకున్న దొంగకి దేహశుద్ధి చేసి కాళ్లు, చేతులను తాళ్లతో బంధించారు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని దొంగ కోటేశ్‌ని అదుపులోకి తీసుకున్నారు. దొంగ కోటేశ్‌తో పాటుగా మరో ఇద్దరు కూడా ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. దొంగ కోటేశ్‌పై పలు ప్రాంతాల్లో చోరీ కేసులు ఉన్నట్లుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మిర్యాలగూడెంకి చెందిన కోటేశ్‌పై మిర్యాలగూడెం, నల్గొండ, హుజుర్‌నగర్, గుంటూరు, తిరుపతితో పాటుగా పలు ప్రాంతాల్లో జరిగిన చోరీల్లో నిందితుడిగా గుర్తించారు. కోటేశ్‌ని విచారణ చేస్తే మరింత సమాచారం వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

అర్థం చేసుకొని చదివినప్పుడే లక్ష్యం సాధ్యం

పెదకూరపాడు: ప్రతి విద్యార్థి అర్థం చేసుకొని చదివినప్పుడే లక్ష్యం నెరవేరుతోందని ఆడిట్ డిపార్ట్‌మెంట్ స్టేట్ డైరెక్టర్ కొర్లకొండ సుబ్బారావు అన్నారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు శనివారం అందజేశారు. పాఠశాల 1981–1986 సంవత్సరం వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సహకారంతో రూ.72 వేలు ఉపకార వేతనాన్ని 20 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్నారై, పూర్వ విద్యార్థి రామకృష్ణ బాలినేని మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించడం కోసమే ఈ స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి నార్నెపాడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీరపనేని రమేష్, మోదేపల్లి రమాదేవి, రావూరి విశ్వనాథ శర్మ, తస్నీరు హరిప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ, పూర్వ విద్యార్థులు చల్లపల్లి సత్యం, కోరంపల్లి పద్మారావు, షేక్ అక్బర్, విప్పర్ల శ్రీనివాస్ రెడ్డి, మంచినీళ్ల శ్రీధర్, దాసరి విజయ్ బెన్ని బాబు, కొమ్మినేని వెంకటేశ్వర్లు, మన్నవ వెంకట్రావు, చుండు సామ్రాజ్యం, లీలావతి, పాల్గొన్నారు.